సాక్షి
అనకాపల్లి
గురువారం ၊ 4 ၊ సెప్టెంబర్ ၊ 2025



భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

ఒడ్డిమెట్టలో లక్ష్మీ గణపతి కొలువైన కైలాసగిరి చుట్టూ బుధవారం గిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. 8లో

చందన భూషితుడు



చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో చందనం అలంకరణలో కార్యసిద్ధి గణపతిస్వామి భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో 8వ రోజున పెద్దసంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. -చోడవరం

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులలో ఆకాశం మేఘావృతమై ఉండి. తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 33.3 నుంచి 34.5 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27.0 నుంచి 27.5 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

న్యూస్‌రీల్

ప్రమాద స్థాయిలో పెద్దేరు

- అప్రమత్తమైన అధికారులు



జలాశయం నుంచి విడుదల చేస్తున్న వరద నీరు

మాడుగుల: పెద్దేరు జలాశయం బుధవారం నాటికి ప్రమాద స్థాయికి చేరుకుంది. కేచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు అధికమవ్వడంతో జలాశయంలోకి 500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నీటిమట్టం 136.68 మీటర్లకు చేరుకుంది. జలాశయం ప్రమాద స్థాయి 136.5 మీటర్లు కాగా ఆ స్థాయి దాటడంతో ప్రధాన గేటు ద్వారా 500 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఏ సమయంలోనైనా జలాశయం నుంచి వరద నీరు విడుదల చేస్తారని, ఏటి బాధిత రైతులు పెద్దేరు నదిలో దిగరాదని తహసీల్దార్ రమాదేవి తెలిపారు.

నేడు స్థాయీ సంఘ సమావేశం



అల్లిపురం: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశంలో 198 అంశాలను చర్చించనున్నారు. వీటిలో నీటి సరఫరా, కాలువలు, కల్వర్టుల నిర్మాణాలు, గ్రీన్ బెల్ట్ ప్రాంతాల అభివృద్ధి, బీటీ రోడ్డు నిర్మాణాలు, సీసీ రోడ్ల నిర్మాణాలు, భూగర్భ మురుగునీటి పారుదల పనులు, ప్రజారోగ్యం, గెడ్డల ఆధునికీకరణ, పరిపాలనా పరమైన విధానాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. నూతన స్థాయీ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న తొలి సమావేశం ఇది.

‘ఇంటింటి’ భారం మావల్ల కాదు..

రేషన్ డీలర్ డీలా..

- ఆదాయం తక్కువ.. ఖర్చులు ఎక్కువ అంటూ ఆందోళన
- వృద్ధులు, దివ్యాంగుల ఇంటికే సరకుల పంపిణీతో ఆర్థిక భారం పడుతోందని ఆవేదన
- కమీషన్ పెంచాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం
- లేకుంటే మూకుమ్మడి రాజీనామాకు సిద్ధమని ప్రకటన
- వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే బాగుందంటున్న డీలర్లు

ఎండీయూల రద్దుతో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తమవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను నిలిపివేయడంలో భాగంగా కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయం లబ్ధిదారులకే కాక రేషన్ డీలర్లకు సైతం సమస్యలు తెచ్చిపెట్టింది. ఇన్నాళ్లూ ఇళ్ల వద్దనే సరకులు అందుకున్న జనం ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. ఒంటరి వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆ భారం డీలర్లపైనే మోపింది. నష్ట నివారణ కోసం తీసుకున్న ఈ నిర్ణయం తమకు గుదిబండగా మారిందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరకులు ఇంటికి సరఫరా చేసినందుకు కనీసం ఖర్చులైనా చెల్లించాలని వారు కోరుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తమకు గౌరవం దక్కిందని.. చంద్రబాబు సర్కారులో చాకిరీ మిగిలిందని వాపోతున్నారు.

తుమ్మపాల: ఎండీయూలను రద్దు చేసి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం తీరు.. ఇప్పుడు రేషన్ డీలర్లలో ఆగ్రహావేశాలను రగిలిస్తోంది. కేజీకి కేవలం రూ.1 కమిషన్‌తో అరకొర ఆదాయంతో నెట్టుకొస్తున్న తమకు రోజుకో రకంగా నిబంధనలు పెడుతూ పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ఖర్చంటూ ఎండీయూ వాహనాలను నిలిపేసి ఆ భారాన్ని తమపై రుద్దడం దారుణమని డీలర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కష్టానికి తగ్గ ఫలితం రావడం లేదంటున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వానికి మించి మంచి జరుగుతుందని, తమ బతుకులు మారతాయని కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే వెట్టిచాకిరి చేయించేలా కార్యాచరణ చేపడుతున్నారని వాపోతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కిరోసిన్ నిలిపివేత, బయోమెట్రిక్ విధానం తీసుకొచ్చి డీలర్ల పొట్టకొట్టిన చంద్రబాబు మళ్లీ ఇప్పుడు కూడా అదే ధోరణిలో ఉన్నారని, జగన్ ప్రభుత్వంలో ప్రశాంతంగా ఉన్న తాము కూటమి ప్రభుత్వంలో అష్టకష్టాలు పడుతున్నామని, ప్రభుత్వం గోరంత ఇచ్చి కొండంత పనులు చెబితే సహించేది లేదని అవసరమైతే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామంటూ హెచ్చరికలు చేస్తున్నారు. సరకుల పంపిణీ నిలిచిపోకుండా అధికారులు డీలర్లను బుజ్జగిస్తూ నెట్టుకొస్తున్నారు.

ఆర్థిక భారం

రేషన్ డిపోల ద్వారా బియ్యం పంపిణీ చేసినందుకు ప్రభుత్వం డీలర్లకు కొన్నేళ్లుగా కేజీకి కేవలం రూ.1 కమిషన్‌గా చెల్లిస్తోంది. దీంతో డిపోల నిర్వహణ కష్టంగా ఉందని డీలర్లు చెబుతున్నారు. కమీషన్ పెంచాలని, ఒంటరి వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దకే సరకుల పంపిణీ ఖర్చులకు గాను అదనంగా నెలకు రూ.5 వేలు ఇవ్వాలని కోరుతున్నారు. డిపో నిర్వహణతోపాటు సరకుల పంపిణీకి కూలీని పెట్టడానికి, ఒంటరి వృద్ధుల ఇంటింటి సరకుల పంపిణీతో పాటు ఇతర పనులను నెలకు రూ.10 నుంచి 15 వేల వరకు ఖర్చవుతుందని చెబుతున్నారు. ఇంటింటి సరకుల పంపిణీకి ద్విచక్ర వాహనం, పెట్రోల్ ఖర్చులు కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదంటున్నారు.





ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు సరకులు పంపిణీ చేస్తున్న డీలర్లు

జిల్లాలో రేషన్ డిపోలు	1,069
ఒంటరి వృద్ధులు, దివ్యాంగుల కార్డులు	68,751



పౌర సరఫరాల శాఖ అధికారుల సమావేశంలో పాల్గొన్న డీలర్లు (ఫైల్)

అన్నీ ఇన్నీ సమస్యలు కావు

జిల్లాలో ఉన్న మొత్తం 1,069 డిపోల పరిధిలో దివ్యాంగులు, ఒంటరి వృద్ధులకు సంబంధించి 68,751 కార్డులున్నాయి. వీరి ఇళ్లకు వెళ్లి సరకులు అందించాల్సి ఉంది. అయితే అందులో 45,964 కార్డుదారులకు మాత్రమే (66.86 శాతం) ఇంటికి వెళ్లి పంపిణీ చేయగలుగుతున్నామని డీలర్లు చెబుతున్నారు. మిగిలిన వారికి పంపిణీ చేయడంలో పలు రకాల ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్లలో పై అంతస్తుల్లో ఉన్న వారికి సరకులు మోసుకెళ్లడం కష్టంగా ఉందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కొన్ని పెద్ద డిపోలు తప్ప దాదాపు 95 శాతం డిపోల పరిధిలో కార్డులు తక్కువ ఉంటాయి. కేవలం 2 నుంచి 3 టన్నుల సరకులు పంపిణీ చేయాల్సిన డిపోలు అనేకం ఉంటాయి. వారికి రెండు మూడు వేల రూపాయల కమిషన్ మాత్రమే వస్తుంది.

జగన్ ప్రభుత్వంలో డీలర్లకు గౌరవ వేతనం

గత ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఏనాడూ డీలర్లు ఆందోళన చెందలేదని ఇటీవల పట్టణంలో జరిగిన డీలర్ల సమావేశంలో పలువురు అధికారుల ముందే కుండబద్దలు కొట్టారు. ఎండీయూ వాహనాలను పెట్టినప్పటికీ తమకు ఎటువంటి హానీ జరగలేదని, సరకుల పంపిణీ పని లేకుండానే కేజీకి రూ.1 కమీషన్ బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యేదని, కూటమి ప్రభుత్వంలో తలవంపులు తప్ప తమకేమీ మిగలడం లేదని వాపోయారు. అదనపు కమిషన్ చెల్లించకుండా ఇంటింటి సరకుల పంపిణీపై ఒత్తిడి చేస్తే రాజీనామాలకు సిద్ధమని గత నెల 21న పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్వహించిన సమావేశంలో డీలర్లు స్పష్టం చేశారు.

నెలకు రూ.5 వేలు చెల్లించాలి



1983 నుంచి డీలర్‌గా ఉన్నాను. ఎప్పుడూ ఇలాంటి కష్టం పడలేదు. బహుళ అంతస్తులు, అపార్ట్‌మెంట్లలో ఉండే వారికి సరకుల పంపిణీ భారంగా ఉంది. వాహనంపై సరకులు తీసుకెళ్లడానికి బండికి పెట్రోల్, పనిమనిషికి ఖర్చు ఎవరిస్తారు. నెలకు రూ.5 వేలు అదనంగా అందించాలి.

– **బండి అప్పారావు**, ఉపాధ్యక్షుడు, రేషన్ డీలర్ల సంఘం, అనకాపల్లి రూరల్

మా కష్టాన్ని గుర్తించడం లేదు



గత ప్రభుత్వం డీలర్లకు వేతనం చెల్లించడంతో పాటు ఎండీయూ వాహనాలకు అదనంగా చెల్లించేది. సరకులు ఇంటింటికీ అందించేది. ఇప్పుడు కూడా అదేవిధంగా సరకులు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నందుకు ఖర్చులు చెల్లించాలి. ప్రస్తుత ప్రభుత్వం మా కష్టాన్ని గుర్తించడం లేదు.

-కె.నూకయ్యశెట్టి, డీలర్, గాంధీనగరం

పైడమ్మ చెరువు కోసం హైకోర్టుకు కొత్తపేట సర్పంచ్

- కలెక్టర్‌కు, నేవల్‌బేస్ పీడీకి నోటీసులు!

రాంబిల్లి (అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని నేవల్‌బేస్ గేట్‌కు ఎదురుగా గల పైడమ్మ చెరువు వివాదం హైకోర్టుకు చేరింది. రాంబిల్లి మండలంలోని కొత్తపేట రెవెన్యూ సర్వే నంబర్ 287/1ఏలో ఉన్న 130 ఎకరాల పైడమ్మ చెరువును నేవల్ బేస్‌కు అప్పటి రెవెన్యూ యంత్రాంగం అప్పగించడంతో ఇటీవల కాలంలో ఫెన్సింగ్ వేసేందుకు అధికారులు యత్నించారు. దీంతో వాడనర్సాపురం, కొత్తపేటతోపాటు సుమారు 21 గ్రామాలకు సంబంధించి వరద నీటి నియంత్రణకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఇప్పటికే ఫెన్సింగ్ పనులను అడ్డుకున్న వాడనర్సాపురంవాసుల తరఫున కొత్తపేట సర్పంచ్ అరుణ లత హైకోర్టును ఆశ్రయించారు. దీంతో చెరువుకి సంబంధించి భూబదలాయింపు విషయమై నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. దీనికి తోడు పైడమ్మ చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఎందుకు ఆపకూడదని నేవల్‌బేస్ పీడీకి కూడా నోటీసులు పంపింది. ఈ చెరువులో పూర్వం నుంచి సరుగుడు తోటలు వేస్తూ జీవనం సాగించేవారని, గడ్డి వ్యవసాయానికి ఉపయోగించేవారని, నేవల్‌బేస్ గేట్ ముందు వేసిన ఎత్తయిన రోడ్డు వల్ల పైడమ్మ చెరువులో ఇప్పుడు గతంలోలా కార్యకలాపాలు నిర్వహించడం లేదని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తూ హైకోర్టుని ఆశ్రయించిన నేపథ్యంలో అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఆశ వర్కర్ల నియామకానికి నోటిఫికేషన్

అనకాపల్లి టౌన్: జిల్లాలో ఆశ వర్కర్ల నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.హైమవతి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణం, రూరల్ ప్రాంతాలలో ఉన్న పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో అర్బన్ ప్రాంతంలో 12, రూరల్ ప్రాంతంలో 49 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు 10వ తరగతి కనీస విద్యార్హత కాగా 12వ తరగతి చదివిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. వయసు 25 నుంచి 45 సంవత్సరాల మధ్యలో ఉండాలన్నారు. అర్హులైన వారు పూర్తి వివరాల కోసం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



ఎల్.వి.నారాయణరావు



డి.గోపీనాథ్



నాగజ్యోతి

- రాష్ట్ర స్థాయి అవార్డులకు ముగ్గురు ఎంపిక
- రేపు అమరావతిలో అవార్డుల ప్రదానం

కె.కోటపాడు: గొండుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ(జీవశాస్త్రం) ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ఎల్.వి.నారాయణరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయని పురస్కారానికి ఎంపికయ్యారు. బుధవారం సాయంత్రం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులలో నారాయణరావు ఒకరుగా ఉన్నారు. పాఠశాలలో ఉత్తమ విద్యాబోధనను అందించడమే కాకుండా పాఠశాలలో సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ నారాయణరావు ముందుంటారు. ఈ అవార్డును ఈ నెల 5న అమరావతిలో నారాయణరావు అందుకోనున్నారు.

సంఘమిత్ర, సిరి ఫౌండేషన్ ద్వారా సేవలు..

కె.కోటపాడు కేంద్రంగా డాక్టర్ బండారు రామచంద్రరావు స్థాపించిన సంఘమిత్ర రూరల్ డవలప్‌మెంట్ సొసైటీలో సభ్యునిగా, సిరి ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యునిగా ఉపాధ్యాయుడు నారాయణరావు సేవలను అందిస్తున్నారు. ఈ సొసైటీల ద్వారా 2010 నుంచి ఉచిత వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు చేయూత, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, గ్రంథాలయాలు, క్రీడా మైదానాల్లో మౌలిక వసతులను కల్పన వంటి సేవలు అందించారు. ఆయన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల మండల విద్యాశాఖాధికారులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ నేతకు పురస్కారం

నర్సీపట్నం : పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. నర్సీపట్నం శివపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి గాను ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, పీఆర్‌టీయు నర్సీపట్నం మండలం తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

క్రీడా‘జ్యోతి’కి పురస్కారం

రోలుగుంట: రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పని చేస్తున్న పి.వి.ఎం.నాగజ్యోతి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఆమెకు ప్రొసీడింగు కాపీ అందినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవార్డుకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. విద్యార్థులు సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా వారిలో ఆత్మవిశ్వాసం పెంచేందుకు అనేక వినూత్న కార్యక్రమాలను రూపొందించి అమలు పరచడంలో ఆమె విజయాలు సాధిస్తున్నారు. నాగజ్యోతి క్రీడాకారిణిగా పలు పతకాలు అందుకున్న విషయం తెలిసిందే.

యూరియా కోసం మండుటెండలో నిరీక్షణ 8లో

- దేవరాపల్లిలో గంటల తరబడి అన్నదాతలకు నరకయాతన
- పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేసిన అధికారులు



టీడీఆర్ బాండ్లు వద్దే వద్దు..

- వీఎంఆర్‌డీఏ ఆఫీసు ఎదుట అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితుల నిరసన
- నగదు రూపంలోనే పరిహారం చెల్లించాలంటూ డిమాండ్

సాక్షి, విశాఖపట్నం:

అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డు విస్తరణ బాధితులు కదం తొక్కారు. నష్టపరిహారాన్ని టీడీఆర్ బాండ్ల రూపంలో కాకుండా నగదు రూపంలోనే అందించాలని డిమాండ్ చేస్తూ విశాఖలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయం ఎదుట బుధవారం నిరసనకు దిగారు. ఇళ్లు, దుకాణాలు, భూములకు ఒకేసారి నష్టపరిహారం చెల్లించాలని నినదించారు. అనంతరం రోడ్డు విస్తరణ నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము ఆధ్వర్యంలో నిర్వాసితులు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో నిర్వహించిన గ్రామ సభల్లో టీడీఆర్ బాండ్లు వద్దని నిర్వాసితులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారని, అయినా బాండ్లే ఇస్తామని అధికారులు పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ వాపోయారు. మూడు రోజుల క్రితం అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వాలంటూ కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయడంపై మండిపడ్డారు. నిర్వాసితులంతా పేదవారని, వారికి టీడీఆర్ బాండ్లు ఏమాత్రం ఉపయోగపడవని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నగదు రూపంలో నష్ట పరిహారం అందించి, తమకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు పరిహారం ఇవ్వడంతోపాటు ప్రభుత్వమే ఉపాధి కల్పించాలన్నారు. 100 అడుగుల తర్వాత నిర్మించుకునే ఇళ్లకు ఎటువంటి నిబంధనలు విధించరాదన్నారు.



టీడీఆర్ బాండ్లు మాకొద్దు అంటూ విశాఖలో వీఎంఆర్‌డీఏ ఎదుట నినదిస్తున్న నిర్వాసితులు

మూడు నియోజకవర్గాలు.. 1225 మంది బాధితులు

అనకాపల్లి–అచ్యుతాపురం రోడ్డు విస్తరణ కోసం మూడు నియోజకవర్గాల పరిధిలో 125 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఈ భూముల్లో దాదాపుగా 1225 మంది నిర్వాసితులున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దేవుడి మాన్యంలో ఉన్న 12 మంది నిర్వాసితులకు, ఆర్‌అండ్‌బీ, పీడబ్ల్యూ స్థలాల్లో ఉన్న 62 మంది నిర్వాసితులకు బలవంతంగా టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. మిగిలిన నిర్వాసితులు టీడీఆర్ బాండ్లు తీసుకోకుండా వ్యతిరేకించారు. ఆరునూరైనా తీసుకోరాదని పట్టుదలగా ఉన్నారు.

కమిషనర్‌కు వినతి ఇస్తే.. సమాధానమే లేదు



మాకు టీడీఆర్ బాండ్లు వద్దు.. నష్ట పరిహారంగా నగదు ఇవ్వాలి. 2023లో గ్రామాల వారీగా ధర నిర్ణయించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నష్ట పరిహారం ఇవ్వడానికి అంతా సిద్ధం చేశారు. ఆ సమయంలో ఎన్నికల కోడ్ వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ జీవో రద్దు చేశారు. గత నెల 31న టీడీఆర్ బాండ్లు ఇస్తామంటూ జీవో ఇచ్చారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్‌ను కలిసి టీడీఆర్ బాండ్లు వద్దు అని కోరాం. మాకు సంబంధం లేదని సమాధానం చెప్పకుండా వెళ్లిపోయారు.

– **కర్రి అప్పారావు**, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, తిమ్మరాజు పేట, అచ్యుతాపురం మండలం

ముక్తకంఠంతో వ్యతిరేకించినా తీసుకోమని తీవ్ర ఒత్తిడి



మునగపాక మండలం తిమ్మరాజుపేటలో నాకున్న 64 గజాలు పోతుంది. ఇందుకు పరిహారంగా టీడీఆర్ బాండ్లు తీసుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. బడా కంపెనీల కోసం రైతు నష్టపోవాలా..? కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిర్వాసితులమంతా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాం. ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రామ సభ నిర్వహించారు. నిర్వాసితులమంతా టీడీఆర్ బాండ్లు వద్దంటూ ముక్త కంఠంతో వ్యతిరేకించాం. మళ్లీ టీడీఆర్ బాండ్లు ఇస్తామంటున్నారు. ఇదెక్కడి న్యాయమో అర్థం కావడం లేదు.

– **కొంత్యాన బ్రహ్మాజీ**, మునగపాక మండలం, తిమ్మరాజు పేట

దండాలు ‘బాబూ’.. పొర్లుదండాలు

- తాచేరు వంతెన, డైవర్షన్ రోడ్డు నిర్మించండి
- సీపీఎం నాయకుల వినూత్న నిరసన



గండి పడ్డ తాచేరు వంతెనపై పొర్లు దండాలతో నిరసన తెలుపుతున్న కమ్యూనిస్టు నాయకులు

బుచ్చెయ్యపేట: కూలిన వంతెన, కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు తక్షణం నిర్మించి ప్రజలకు రవాణా సదుపాయం కల్పించాలంటూ సీపీఎం నాయకులు వినూత్న నిరసన తెలిపారు. బుధవారం సాయంత్రం గండి పడ్డ విజయరామరాజుపేట తాచేరు డైవర్షన్ రోడ్డుపై పొర్లు దండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. మూడు జిల్లాల ప్రజలు రాకపోకలు సాగించే భీమునిపట్నం–నర్సీపట్నం(బీఎస్) ప్రధాన రోడ్డులో కల్వర్టులు కూలిపోయినా ప్రభుత్వం గానీ, స్థానిక ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకపోవడంపై సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు, రైతు సంఘ నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఎస్ రోడ్డులో పనులు చేపట్టకపోవడంపై కోర్టులో కేసు వేయగా.. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై కోర్టు మండిపడినట్టు వారు తెలిపారు. నెల రోజుల కిందట వడ్డాదిలో పెద్దేరు డైవర్షన్ రోడ్డు, విజయరామరాజుపేట తాచేరు డైవర్షన్ రోడ్డు నీటి ప్రవాహానికి దెబ్బతినగా నేటికీ బాగు చేయకపోవడంపై మండిపడ్డారు. అత్యవసర సమయంలో రోగులను 108 వాహనంలో తరలించాలన్నా, రైతులు పంటలను తీసుకెళ్లాలన్నా, విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలకూ తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి బీఎస్ రోడ్డులో కూలిన తాచేరు, పెద్దేరు వంతెనలు, దెబ్బతిన్న కల్వర్టులు నిర్మించి ప్రజలకు రవాణా సదుపాయం కల్పించకపోతే ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

క్లుప్తంగా

జనసేన ఫ్లెక్సీలకు విద్యుత్ కనెక్షన్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



కశింకోట: మండలంలోని జి.భీమవరంలో నిబంధనలకు విరుద్ధంగా జనసేన నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్‌ను అధికారులు తొలగించారు. ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చి ఫ్లెక్సీలకు లైటింగ్, విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ విషయమై 'జనసేన బరి తెగింపు'శీర్షికన సాక్షిలో బుధవారం వార్త ప్రచురితం కావడంతో స్పందించిన విద్యుత్ అధికారులు కనెక్షన్ తొలగించారు.

వడ్డాది హైస్కూల్ హెచ్‌ఎంపై డిప్యూటీ డీఈవో విచారణ



విద్యార్థులను విచారిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

బుచ్చెయ్యపేట : వడ్డాదిలోని కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్‌ఎంపై వచ్చిన ఆరోపణలపై డిప్యూటీ డీఈవో పి.అప్పారావు విచారణ చేశారు. పాఠశాల హెచ్‌ఎం ప్రసన్న కళ బయట యువకుడిని స్కూల్‌కు తీసుకురావడం, ఆ యువకుడు బాలికల ఫొటోలు తీసి మార్ఫింగ్ చేయడం,విద్యార్థులను వేధించడం, నాడు-నేడు పనులు సక్రమంగా చేయకపోవడంపై స్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యులు,తల్లిదండ్రులు, నాయకులు మంగళవారం పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్రికల్లో వార్తలు రావడంతో యలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు బుధవారం పాఠశాలను సందర్శించి, స్కూల్ రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం, విద్యార్థులను, తల్లిదండ్రులను, నాయకులను విచారణ జరిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, ఇప్పటికే వడ్డాది హెచ్‌ఎంకు మెమో జారీ చేశామని డిప్యూటీ డీఈవో తెలిపారు.

కేజీహెచ్‌లో లైజనింగ్ అధికారి నియామకం

అనకాపల్లి టౌన్: జిల్లాలోని గిరిజనులకు విశాఖ కేజీహెచ్‌లో వైద్య సేవలందించేందుకు ట్రైబల్ సెల్‌లో బి.బెన్నిబాబు అనే లైజనింగ్ అధికారి నియమించినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.హైమావతి తెలిపారు. కేజీహెచ్‌లో గిరిజనులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన సలహాలు, సూచనలు అందజేస్తారని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా వర్తించని మందులు, టెస్ట్‌ల కోసం గిరిజన రోగులకు రూ.1500 నుంచి రూ.2000 వరకూ ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. వైద్య సలహాల కోసం 9912415706 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఒడ్డిమెట్టలో భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

- వందలాదిగా తరలివచ్చిన భక్తజనం
- కోలాటాలు, భజన బృందాలతో శోభాయమానంగా సాగిన యాత్ర



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న వందలాది మంది భక్తులు



కోలాటమాడుతున్న మహిళలు

నక్కపల్లి:

ఒడిమెట్టలో భక్తుల జయజయ ధ్వానాల మధ్య గిరి ప్రదక్షిణ బుధవారం వైభవంగా సాగింది. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఒడ్డిమెట్టలో లక్ష్మీగణపతి ఆలయం గల కైలాసగిరి చుట్టూ భక్తులు ఉత్సాహంగా ప్రదక్షిణ చేశారు. ఉదయం ఐదుగంటలకు ప్రారంభమైన ఈ గిరిప్రదక్షిణలో నక్కపల్లి, అడ్డురోడ్డు, తుని, పాయకరావుపేట పట్టణాలతోపాటు, పరిసర గ్రామాలనుంచి తరలివచ్చిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్వామివారు స్వయంభూగా వెలసిన చోట ఆలయం నిర్మించి పూజలు మొదలుపెట్టిన 150 సంవత్సరాల తర్వాత తొలి సారిగా ఈ గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయం ఎంతో ప్రాచుర్యం పొందింది. గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని ముందుగా అర్చక స్వాములు జయంతిగోపాలకృష్ణ కైలాసగిరిపై స్వయంభూగా వెలసిన లక్ష్మీగణపతి మూలవిరాట్‌కు, స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి కొండ దిగువన ఉన్న తూర్పు మండపం వద్ద కొబ్బరి కాయ కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. జాతీయరహదారి, ఒడ్డిమెట్ట పాతరోడ్డు, గుంటపల్లి పాతరోడ్డు , రామాలయం, పశ్చిమ గణపతి మండపం, జాతీయరహదారిమీదుగా తిరిగి తూర్పు మండపానికి అక్కడనుంచి కైలాసగిరిపైకి యాత్ర సాగింది. మహిళల కోలాటాలు, భజన బృందం ఆలపించిన భజన గీతాలతో గిరి ప్రదక్షిణ శోభాయమానంగా జరిగింది. గణపతి బప్పా మోరియా, జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై అంటూ భక్తులు లంబోదరుడిని స్మరిస్తూ గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. వినాయకుని నామస్మరణతో ఒడ్డిమెట్ట పరిసర ప్రాంతాలు మార్మోగాయి. సుమారు 3 కిలోమీటర్ల మేర జరిగిన ఈ గిరిప్రదక్షిణ అనంతరం మూలవిరాట్ ఉన్న ఆలయం చుట్టూ స్వామివారి ఉత్సవ మూర్తులతో ప్రదక్షిణ నిర్వహించారు. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులంతా స్వామివారిని దర్శించుకున్నారు. ఉద్దండపురం , గొడిచర్ల, దేవవరం, నామవరం, గుంటపల్లి, సీతారామపురం, పాయకరావుపేట తుని, పి.ఎల్.పురం తదితర గ్రామాలనుంచి వందలాది మంది మహిళలు తరలివచ్చారు.ఈకార్యక్రమానికి రూపకల్పన చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోటనగేష్, దేవస్థానం మాజీ చైర్మన్ గెడ్డం బుజ్జి మాట్లాడుతూ మొదటి సారి ప్రారంభించిన ఈ గిరిప్రదక్షిణకు చుట్టుపక్కల ప్రాంతాలనుంచి వందలాది మంది తరలి రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించాలని ప్రతిపాదించిన తుని ఆర్యవైశ్య సంఘం వారికి అభినందనలు తెలియజేశారు. వచ్చే ఏడాది ముందుగానే గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటు చేసి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, యాత్రలో ఎక్కువమంది పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రదక్షిణలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ గొర్ల రాఘవకుమారి, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, ఒడ్డిమెట్ట దేవస్థాం చైర్మన్ పైలా నూకన్న నాయుడు, మాజీ చైర్మన్ దండు బలరామ రాజు, ఇందుకూరి రవిరాజు, ఐ.సుధారాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్ల నర్సింహమూర్తి, పైల సూరిబాబు, అన్నవరం దేవస్థానం మాజీ డైరెక్టర్ దోమాడ సుందరరావు, వికాస తరంగిణి ప్రతినిధులు చిక్కాల శ్రీనివాస్, జగతా శ్రీనివాస్,రామాల శివ, పాండురంగ స్వామి దేవస్థాన మాజీ చైర్మన్ యాళ్ల వరహాలు, వెలగా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీకి దివ్యాంగుల గుర్తింపు

చోడవరం: ప్రత్యేక అవసరాల విద్యార్థుల్లో సామర్థ్యాన్ని, అభిరుచులను గుర్తించి వాటికి అనుగుణంగా బోధన చేస్తే ఎంతో మేలు జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. చోడవరం బాలికోన్నతపాఠశాలలో బుధవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల కోసం గుర్తింపు నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి నియోజకవర్గంలో గల ప్రత్యేక అవసరాల పిల్లలంతా వచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ.. దివ్యాంగులైన పిల్లల్లో లోపాలను కాకుండా వారి సామర్థ్యం, అభిరుచులను తెలుసుకొని వారికి బోధన చేస్తే మంచి ఫలితాలు సాధిస్తారని ఉపాధ్యాయులకు సూచించారు. వీటిని గుర్తించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. వీరికి ఉపకరణాలతోపాటు అవసరమైన అలవెన్సులు కూడా అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఇటువంటి సామర్థ్యం కలిగిన పిల్లలను గుర్తించామని, ఇటీవల జాతీయ స్థాయి క్రీడల్లో కూడా రాణించారన్నారు. పిల్లలను విధిగా భవిత కేంద్రాలను పంపించాలని ఆయన కోరారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త కృష్ణంరాజు మాట్లాడుతూ జిల్లాలో ఇటువంటి శిబిరాలు ఆరు నిర్వహించామని చెప్పారు. మానసిక దివ్యాంగులు 94మంది, శారీరక దివ్యాంగులు 45మంది, వినికిడి లోపం ఉన్న వారు 38మంది, దృష్టిలోపం ఉన్నవారు 12మందిని ఉపకరణాల కోసం గుర్తించామన్నారు. ఎంఈవోలు పాండురంగారావు, సింహాచలం, భవిత కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ బృందం పర్యటన



చీడికాడలో ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పిస్తున్న డీపీఎం లచ్చన్న



జి. కొత్తపల్లిలో ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

చీడికాడ: మండలంలోని రెండు గ్రామాల్లో గుజరాత్ నుంచి వచ్చిన ప్రకృతి వ్యవసాయ బృందం బుధవారం పర్యటించింది. చీడికాడ, జి.కొత్తపల్లి, గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ఏలా జరుగుతుందో పరిశీలించి, రైతులతో చర్చించింది. పీఎండీఎస్ ప్రయోజనాలు, ద్రవజీవామృతం, ఎ. గ్రేడ్ ఏటీఎం మోడల్స్, బీజామృతం వినియోగం గురించి రైతులు.. బృందం సభ్యులకు వివరించారు. అనంతరం నార్త్ రీజియన్ సమన్వయకర్త హేమచంద్ర ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, ప్రకృతి వ్యవసాయంలో నాలుగు స్తంభాలు, తొమ్మిది సూత్రాలను ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించారు. ద్రవజీవామృతం, వేప బీజామృతం వినియోగం, పోషకాహార అంశాలను తెలియజేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి సీహెచ్. లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



నర్సీపట్నంలోని హోల్‌సేల్ దుకాణంలో స్టాక్ వివరాలు తెలుసుకుంటున్న విజిలెన్స్ అధికారి నాయక్



కొత్తకోటలో ఎరువులు దుకాణాలులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు:

నర్సీపట్నం: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అగ్రికల్చర్ ఆఫీసర్ నాయక్, కానిస్టేబుల్, ఏవో విజయలక్ష్మి ముందుగా స్థానిక శ్రీసత్యనారాయణ హోల్‌సేల్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. దుకాణంలో ఎరువులు, స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న వివరాలను సరిపోల్చి చూశారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటామని డీలర్‌ను హెచ్చరించారు. ఎరువులు కొనుగోలు చేసే రైతులకు విధిగా రసీదు ఇవ్వాలని సూచించారు.

రావికమతం: మండలంలో కొత్తకోట, రావికమతంలలో ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ ఎస్‌ఐ రవి కుమార్ నేతృత్వంలోని అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. కొత్తకోటలోని త్రినేత్ర ఆగ్రో ఏజెన్సీ షాపు, రావికమతంలోని శ్రీనివాస ఫెర్టిలైజర్, ఈశ్వర జనరల్ స్టోర్స్‌లో ఎరువుల విక్రయాలు,యూరియా నిల్వలపై సోదాలు చేశారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను విజిలెన్స్ ఎస్‌ఐ రవికుమార్ హెచ్చరించారు.మండల వ్యవసాయాధికారి రమేష్‌బాబు, విజిలెన్స్ కానిస్టేబుల్ బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం మండుటెండలో నిరీక్షణ

- క్యూలైన్‌లో గంటల తరబడి అన్నదాతలు నరకయాతన
- ఆధార్, వన్‌బీ తప్పనిసరితో సిబ్బంది, రైతుల మధ్య వాగ్వాదం
- ఒక బస్తా చొప్పున పంపిణీ చేయడంపై ఆగ్రహం
- పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేసిన అధికారులు



పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం



క్యూలైన్‌లో నిలబడ లేక కూర్చొని పడిగాపులు కాస్తున్న మహిళా రైతులు

దేవరాపల్లి: బస్తా యూరియా కోసం మండుటెండలో అన్నదాతలు నరకయాతన అనుభవించారు. దేవరాపల్లిలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం యూరియా పంపిణీ చేపడుతున్నట్లు విషయం తెలుసుకున్న రైతులు ఉదయం 8 గంటలకే అధిక సంఖ్యలో చేరుకున్నారు. క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షణ చేసి నానా అవస్థలు పడ్డారు. నిలువ నీడ, తాగునీటి సదుపాయం కల్పించకపోవడంతో వృద్ధ రైతులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత్యంతరం లేని పరిస్థితిల్లో మండుటెండను సైతం లెక్క చేయకుండా రైతులు క్యూలో బారులు తీరారు. అయితే రైతుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తామని, ఆధార్, వన్‌బీ తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయ శాఖ సిబ్బంది తెగేసి చెప్పడంతో సిబ్బంది, రైతుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా ఇవేం నిబంధనలు అంటూ పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి అదుపు దాటుతుందని గమనించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి క్యూలైన్‌లో ఉన్న ఒక్కొక్క రైతును పిలిచి యూరియా పంపిణీ చేశారు. అయితే విస్తీర్ణంతో సంబంధం లేకుండా రైతుకు ఒక్క బస్తా మాత్రమే ఇవ్వడంపై పలువురు రైతులు సిబ్బందిని నిలదీశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అరకొరగా యూరియా పంపిణీ చేయడంపై మండిపడ్డారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ వైఫల్యమేనని పలువురు రైతులు బాహటంగా విమర్శలు గుప్పించారు.

ఆరు గంటల పాటు నిరీక్షించా..



ఒక్క బస్తా యూరియా కోసం సుమారు 6 గంటల పాటు క్యూలో నిరీక్షించా. ఎకరం యాభై సెంట్ల విస్తీర్ణంలో వరి, మరో ఎకరం యాభై సెంట్ల విస్తీర్ణంలో చెరకు సాగు చేశాను. యూరియా కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది. సాగు చేసిన పంట విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఒక్క బస్తా మాత్రమే ఇవ్వడం దారుణం . ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి.

– లెక్కల దేముడునాయుడు, రైతు, దేవరాపల్లి

ఇలా ఎప్పుడూ ఇబ్బంది పడలేదు..



యూరియా కోసం రైతు సేవా కేంద్రానికి ఉదయం 8 గంటలకు చేరుకున్నాను. మండుటెండలో సుమారు ఆరు గంటల పాటు పడిగాపులు కాస్తే ఒక్క బస్తా మాత్రమే ఇచ్చారు. గతంలో ఇంత ఇబ్బంది ఎప్పుడూ లేదు. కనీసం మంచినీటి సదుపాయం కూడా కల్పించలేదు. బస్తా యూరియా కోసం రోజంతా పనులు మానుకొని నిరీక్షణ చేయాల్సి వస్తుంది.

– కొల్లి నాగరాజు, రైతు, దేవరాపల్లి

వివాహిత అదృశ్యం



పిల్లి దుర్గా లక్ష్మి

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో ఓ వివాహిత అదృశ్యమైనట్టు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం రాజాం గ్రామం నుంచి పిల్లి దుర్గా లక్ష్మి (35) అనే వివాహిత నరసింగబిల్లిలోని పుట్టింటికి గత నెల 11న వచ్చింది. అక్కడి నుంచి తిరిగి తన అత్తవారి గ్రామమైన రాజాం బయలుదేరినప్పటికీ అక్కడికి చేరలేదు.ఆమె ఆచూకీ కోసం రాజాం, రాజమండ్రి, చెన్నై, విజయవాడ ప్రాంతాల్లో వెదికినా ఫలితం లేకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన జొన్నపల్లి ఈశ్వరరావు



ఈశ్వరరావు (ఫైల్)

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కేపీ అగ్రహారానికి చెందిన జొన్నపల్లి ఈశ్వరరావు(55) కుమారుడు దుర్గాప్రసాద్‌కు నాలుగు నెలల కిందట కొమళ్లపూడి వద్ద ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో కాలు విరిగిపోయి దివ్యాంగుడిగా మారాడు. తన కుమారుడికి సదరం సర్టిఫికెట్ చేయించడం కోసం ఈశ్వరరావు బుచ్చెయ్యపేట వచ్చాడు. మీ సేవా సెంటర్‌కు నడిచి వెళ్తుండగా చోడవరం వివేకానంద కాలేజీ బస్సు వెనక నుంచి ఢీ కొంది. ఈశ్వరరావుపై నుంచి బస్సు వెనుక చక్రాలు వెళ్లగా ఆయన తీవ్రంగా గాయపడి, అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఇతనికి భార్య లక్ష్మి, కుమారుడు దుర్గా ప్రసాద్ ఉన్నారు. ఈశ్వరరావు మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుచ్చెయ్యపేట పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నారు. ప్రైవేటు స్కూల్ యాజమాన్యం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ నాయకులు డిమాండ్ చేశారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



శ్రీనివాస రావు (ఫైల్)

చోడవరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న పాత చెరువులో ప్రమాదవశాత్తు పడి ఒక వ్యక్తి మృతిచెందాడు. చోడవరం కోటవీధికి చెందిన జొన్నాడ శ్రీనివాసరావు (55) బహిర్భూకని చెరువు వద్దకు వెళ్లాడు. ఆసమయంలో వర్షం కురుస్తుండడంతో ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి, మునిగిపోయి మృతిచెందాడు. మృతుడు శ్రీనివాసరావు ప్రైవేటుగా లైటింగ్ పనుల చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్టు చోడవరం పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య





అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్న గొలగాం గ్రామస్తులు, (ఇన్‌సెట్) పడాల విజయలక్ష్మి (ఫైల్)

బుచ్చెయ్యపేట: మండలంలోని నీలకంఠాపురంలో పడాల విజయలక్ష్మి(27) అనే వివాహిత బుధవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అత్తింటివారే అదనపు కట్నం కోసం ఆమెను చంపేశారని మృతురాలి కుటుంబ సభ్యులు బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి సమీపంలోని గొలగాం గ్రామానికి చెందిన జెట్టి అప్పారావు కుమార్తెను నీలకంఠాపురం గ్రామానికి చెందిన పడాల నర్సింగరావుకిచ్చి ఎనిమిదేళ్ల కిందట వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. నర్సింగరావు పనికి వెళ్లకుండా తాగుతూ ఆమెను చిత్ర హింసలకు గురి చేసేవాడు. అదనపు కట్నంతో పాటు భూమి కావాలని భర్తతో పాటు అత్తమామలు విజయలక్ష్మిని వేధించేవారు. అదనపు కట్నంపై పలుసార్లు గొడవలు జరిగాయి. భర్త వేధింపులతో విసుగు చెందిన ఆమె బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. తన కుమార్తె మృతికి అల్లుడు, అతని కుటుంబ సభ్యులే కారణమని మృతురాలి తండ్రి జెట్టి అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు సీఐ కోటేశ్వరరావు తెలిపారు.

ఆస్పత్రి వద్ద ధర్నా

అనకాపల్లి టౌన్: అత్తింటివారే విజయలక్ష్మిని హత్య చేశారని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు, గొలగాం గ్రామస్తులు అనకాపల్లిలో ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద బుధవారం రాత్రి ధర్నా చేశారు. పోస్టుమార్టం పూర్తయినా మృత దేహన్ని తరలించేది లేదంటూ భీష్మించుకూర్చుకున్నారు.

సుగాలి ప్రీతి కేసుపై హైలెవల్ కమిటీ వేయాలి

వైఎస్సార్ సీపీ డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి

సాక్షి, విశాఖపట్నం: సుగాలి ప్రీతి కేసుకు సంబంధించి హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసి, అందులో సీబీఐని భాగస్వామ్యం చేయాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ కుంభా రవిబాబు డిమాండ్ చేశారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కె.భాగ్యలక్ష్మి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ స్వాతిరాణితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. '2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన బాలిక సుగాలి ప్రీతి హత్య జరిగింది. అప్పటి ప్రభుత్వం ఈ కేసును మసిపూసి మారేడుకాయ చేసింది. ప్రీతిని అత్యంత పాశవికంగా హత్య చేసినా, నిందితులను చంద్రబాబు ప్రభుత్వం అప్పుడు, ఇప్పుడు కాపాడుతోంది. ఇప్పుడు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా ఇదే చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఈ కేసు గురించి ఊగిపోయి మాట్లాడిన పవన్, అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదు. సుగాలి ప్రీతి తల్లి కూడా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమను ఆదుకున్నారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత న్యాయం జరగడం లేదని మీడియా సాక్షిగా వాపోయారు. ఆదివాసీలంటే చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపే..' అని రవిబాబు అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఈ కేసును వాడుకున్నారని ఆరోపించిన రవిబాబు.. సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సుగాలి ప్రీతి కోసం ఎక్కడ పోరాటం జరిగినా.. వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, నంద్యాల ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి నాగసారి సుంకన్న, అల్లూరి జిల్లా సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు డాక్టర్ టి.సురేష్‌కుమార్, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దండు మధు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై రెండో రోజు పవిత్రోత్సవాలు

సింహాచలం: సింహగిరిపై రెండో రోజు బుధవారం పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం పవిత్రాదివాసం, చక్రాబ్జమండల రచనం, ఆవాహనం, పవిత్ర ప్రతిష్ట కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులను, సుదర్శన పెరుమాళ్లను వేదికపై వేంజేపచేశారు. నాలుగు వేదాలు, దివ్యప్రబంధాలు, సింహాచలం క్షేత్రమహత్యం విన్నప పారాయణంతో కొలిచారు.

స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

అనకాపల్లి టౌన్: విద్యుత్ షాక్‌తో ఓ మహిళ మృతి చెందింది. పట్టణ ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తుమ్మపాల గవరపేట వీధికి చెందిన కె.రమ్య (21) కొంత కాలంగా అదే గ్రామంలో ఓ వస్త్రదుకాణంలో పని చేస్తోంది. ఈ నెల 30న దుకాణంలో మేడ మీదకు ఇనుప స్టాండ్‌తో దుస్తులు తీసుకువెళుతుండగా సమీపంలో ఉన్న హెచ్‌టీ లైన్ విద్యుత్ వైర్ తగిలి షాక్‌కు గురైంది. చికిత్స కోసం అదే రోజు కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు స్మార్ట్ మీటర్లు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ రీడింగ్ మీటర్

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ సరఫరాను నియంత్రించడానికి, అక్రమ విద్యుత్ అరికట్టడానికి అదానీ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. వీటితోపాటు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పాత విద్యుత్ వైర్ల కూడా మార్పిడి చేస్తున్నారు. దీనివల్ల నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు వృథాను అరికట్ట వచ్చని సిబ్బంది చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే దేశ పురోగతి



సమావేశంలో మాట్లాడుతున్న విజయవాడ రోటరీ మాజీ గవర్నర్ కిషోర్‌కుమార్

అనకాపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం పురోగతి సాధిస్తుందని రోటరీ క్లబ్ విజయవాడ మాజీ గవర్నర్ సీహెచ్.కిషోర్ కుమార్ అన్నారు. స్థానిక న్యూకాలనీ రోటరీ హాల్లో రోటరీ, జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళల కోసం నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. 40 మంది మహిళలకు మూడు నెలలపాటు కుట్టు, ఫ్యాషన్ డిజైన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. విశాఖ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఉగ్గిన శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా మహిళలకు ఉచితంగా పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ పట్టణ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు, కార్యదర్శి కె.వి.పి.ఎస్. ప్రకాశరావు, కోశాధికారి బి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం

మునగపాక: తోటాడ పంచాయతీ పరిధిలో విశాఖ డెయిరీ ఉత్పత్తుల కేంద్రాన్ని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే మార్చి నాటికల్లా ఉమ్మడి 5 జిల్లాల్లో 300కు పైగా ఉత్పత్తుల కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ నెల నుంచి చిత్తూరు జిల్లాలో సుమారు పది వేల లీటర్ల వంతున 15 బల్క్ కూలర్ల నిర్వహణను ప్రభుత్వం విశాఖ డెయిరీకి అప్పగించిందన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, చీఫ్ ఆపరేటింగ్ అధికారి కేవీ ప్రసాద్, మార్కెటింగ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ హరి, చీఫ్ మేనేజర్ సోమునాయుడు, యూనిట్ మేనేజర్ శరగడం రమణ, సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 54 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,390	4,770
రెండో రకం	4,200	4,210
మూడో రకం	3,480	3,570

అనకాపల్లి సినిమాలు

రాజా	: త్రిబాణధారి బార్బరిక్
సత్యనారాయణ స్క్రీన్-1	: కొత్తలోక
సత్యనారాయణ స్క్రీన్-2	: బ్రహ్మాండ
పర్తిసాయి	: మహావతార్ నరసింహం (మ్యాట్నీ, సెకండ్ షో)
పర్తిసాయి	: అర్జున్ చక్రవర్తి (మార్నింగ్ షో, ఫస్ట్ షో)
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: బన్ బట్టర్ జామ్
రామచంద్ర	: వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 79 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-9, బి పాజిటివ్-27, ఒ పాజిటివ్-39, ఏబీ పాజిటివ్-5 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్.9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 328 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్.08924-223595)ని సంప్రదించవచ్చు.



జమాదులపాలెంలో అన్నదాత సుఖీభవ పథకం సహాయం రాని ఈనాం భూముల సాగు రైతులు

సంక్షేమం అందరికీ అందాలి... పేదలందరూ లబ్ధిపొందాలి ఇదీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆకాంక్ష...ఈ మేరకు రైతు భరోసాతో సహా అన్ని పథకాలను లబ్ధిదారులకు అందజేసి, వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసింది.. ఇప్పుడు ప్రభుత్వం మారింది... పథకాలు మొక్కుబడిగా అమలు చేసి...మమ అనిపిస్తోంది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ కోత విధిస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం అమలు కూడా ఇలానే సాగుతోంది. దీంతో ఆర్థిక సాయం అందక పలువురు రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఈనాం భూముల సాగు రైతులకు కూడా ఈ పథకాన్ని ప్రభుత్వం వర్తింపచేయలేదు. దీంతో వారు అవస్థలకు గురవుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఈనాం భూముల సాగు రైతులకు ఈసారి అన్నదాత సుఖీభవ మంజూరు కాలేదు. సొంత భూమి పట్టా కలిగిన రైతులకు అన్నదాత సుఖీభవ మొదటి విడత సాయం మంజూరైంది. ఈనాం భూమి సాగుదారులకు ఆప్షన్ ఇవ్వని కారణంగా మంజూరు కాలేదు. ఈ విషయమై బాధిత రైతుల అభ్యర్థనను ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది.

-ఎం. స్వప్న, మండల వ్యవసాయాధికారి, కశింకోట.

'ఈనాం' రైతులకు ఎగనామం

- గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా మంజూరైనా ఇప్పుడు అందని అన్నదాత సుఖీభవ సాయం
- మంజూరు చేయాలని కోరుతున్న సాగుదారులు



ఈనాం సాగు భూములు

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో ఈనాం భూములు సాగు చేస్తున్న రైతులకు అన్నదాత సుఖీభవ సాయం మంజూరు కాలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వారికి అందించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాత్రం వారికి పథకం మంజూరు చేయలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. జమాదులపాలెంలో సర్వే నంబర్ 195-2లో సుమారు 210 ఎకరాల ఈనాం భూములున్నాయి. సుమారు 250 మంది రైతులు తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అందరూ బీసీ, సన్న,చిన్నకారు రైతులే. సొంత భూములున్న వారికి, కౌలు రైతులకు గత వైఎస్సార్ ప్రభుత్వంలో రైతు భరోసా అందించారు. ఈనాం భూములు సాగు చేస్తున్న రైతులకు కూడా అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో రైతు భరోసా కింద ఆర్థిక సహాయం మంజూరు చేశారు. అలాగే కూటమి ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ పేరిట అందిస్తున్న వ్యవసాయ పెట్టుబడి సాయం మంజూరవుతుందని ఈనాం భూముల సాగు రైతులు ఆశించారు. గత నెలలో తొలి విడతగా మంజూరు చేసిన సుఖీభవ పథకం సాయం వీరికి అందలేదు . సొంత పట్టా భూమి కలిగిన రైతులకు మాత్రమే సాయం అందించారు. దీంతో ఈనాం రైతులు లబోదిబోమంటూ ఈ విషయాన్ని అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గతంలో వలే అన్నదాత సుఖీభవ కింద సహాయం అందించి, ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఈనాం సాగు భూములు

తాతల కాలం నుంచి సాగు చేస్తున్నాం



తాతల కాలం నుంచి ఈనాం భూమి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం కింద వ్యవసాయ పెట్టుబడికి ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో మాత్రం సాయాన్ని అందించకపోవడం శోచనీయం.

-గంపల సాంబమూర్తి, ఈనాం రైతు, జమాదులపాలెం

అన్నదాత సుఖీభవ అందలేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కింద సాయాన్ని అందించారు. అన్నదాత సుఖీభవ కింద కూడా ఎప్పటిలాగే సాయం అందిస్తారని ఆశించాం. అయితే ఈసారి సుఖీభవ కింద మొదటి విడత సహాయం ఇప్పటికీ అందివ్వలేదు.

-ఒమ్మి గంగునాయుడు, ఈనాం రైతు, జమాదులపాలెం

అప్పులు చేయాల్సి వస్తోంది



పంటల సాగు పెట్టుబడికి అప్పులు చేయాల్సి వస్తోంది. అన్నదాత సుఖీభవ కింద ఆర్థిక సహాయాన్ని అందిస్తే కాస్త చేదోడుగా ఉంటుంది. ఆర్థిక సహాయాన్ని తక్షణమే అందించాలి.

- ఒమ్మి రామునాయుడు, ఈనాం రైతు, జమాదులపాలెం

పెట్టుబడి సాయం అందించాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో రైతు భరోసా కింద ఆర్థిక సహాయాన్ని అందించారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందివ్వకపోవడం శోచనీయం. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. దీనివల్ల పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేయడానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. గతంలో వల్లే సత్వరమే ఆర్థిక సాయాన్ని అందించి ఈనాం రైతులను ఆదుకోవాలి.

-ఒ. గంగునాయుడు, మాజీ ఉప సర్పంచ్, ఈనాం రైతు, జమాదులపాలెం

వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు



వేల్పులవీధిలో 36 అడుగుల వినాయక విగ్రహాన్ని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్



వినాయకుని దర్శించుకుంటున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లి టౌన్: పట్టణంలోని పలు వినాయక మండపాల్లో వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త మలసాల భరత్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 126 అడుగుల విగ్రహాన్ని పార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. వీరికి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం భరత్‌కుమార్‌ను కమిటీ సభ్యులు సత్కరించారు. తరువాత వేల్పులవీధిలో వి స్టార్ యూత్ ఏర్పాటు చేసిన 36 అడుగుల వినాయక విగ్రహాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భరత్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నాయకులను కమిటీ సభ్యులు సత్కరించారు. అనంతరం పలు మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవి పేటలో వైస్సార్‌సీపీ నాయకుడు రాయవరపు జోగి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొణతాల మురళీ కృష్ణ, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం. నాయుడు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, ఉగ్గిన అప్పారావు, దొడ్డి హరి తదితరులు పాల్గొన్నారు.

యువత దైవభక్తిని అలవర్చుకోవాలి

అనకాపల్లి: యువత దైవభక్తిని అలవర్చుకోవాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక నర్సింగరావుపేట దుర్గాసాయి గణపతి ఆలయంలో స్వామివారిని బుధవారం ఆమె దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో వినాయక ఉత్సవాలను నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పైన నాగేశ్వరరావు, లోకేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కోన ఉమా, చింతా రాంజీ, సతీష్ రెడ్డి, డొంక సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా మహా శివలింగార్చన




అగ్రహారంలో నిర్వహిస్తున్న మహా శివ లింగార్చన



గవరపేట ఆళ్ల వారి వీధిలో అన్న సమారాధన

కశింకోట: వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక అగ్రహారం వీధిలో బుధవారం బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహా శివ లింగార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం వేదుల వేంకటశాస్త్రి, సంఘం అధ్యక్షురాలు అవసరాల కామేశ్వరి, ప్రతినిధులు సురేష్, వి. ప్రభాకరావు, అధిక సంఖ్యలో బ్రాహ్మణులు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక గవరపేటలోని ఆళ్ల వారి వీధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు భజన కార్యక్రమం నిర్వహించారు. గవరపేట మధ్య వీధిలో నెలకొల్పిన వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాత్రి పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిపారు.

వేతన బకాయిలపై 'ఉపాధి' కార్మికుల ఆందోళన



బొద్దపువానిపాలెంలో ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ కార్మికులు

పరవాడ: ఉపాధిహామీ పథకం కార్మికుల బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో బొద్దపువానిపాలెం పని ప్రదేశంలో ఉపాధి కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు గత 12 వారాలుగా వేతనాలు విడుదల చేయని కారణంగా కార్మికుల కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. కార్మికులకు బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను విరమించుకోవాలన్నారు. ఉపాధి కార్మికులకు ఏడాదికి 200 రోజుల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కొలతలతో పని లేకుండా ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారం రూ.309 వేతనం చెల్లించాలన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికులకు పనులు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లైవ్ ఆడిట్ పేరుతో ఉపాధి కార్మికులను వేధింపులకు గురిచేసే విధానాన్ని మానుకోవాలని కోరారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పాటిపల్లిలో సోలార్ ప్లాంట్ స్థల పరిశీలన



పాటిపల్లిలో సోలార్ ప్లాంట్‌కు కేటాయించిన స్థలం పరిశీలిస్తున్న అధికారులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి పంచాయతీ పరిధిలో సోలార్ ప్లాంట్‌కు కేటాయించిన స్థలాన్ని బుధవారం అధికారులు పరిశీలించారు. సర్వే నంబరు 79లో పదెకరాల స్థలాన్ని సోలార్ ప్లాంట్‌కు కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ డీఈ సురేష్, ఏఈ జగదీష్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో వ్యవసాయ అవసరాల కోసం సక్రమంగా విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, పంచాయతీ కార్యదర్శి రాజు, వీఆర్వో వెంకటరమణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ శివాజీ చదరం

యలమంచిలి రూరల్: ఆధునిక సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకుని, పరిశోధన చేస్తే యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని జాతీయ శాస్త్ర సాంకేతిక శాస్త్రవేత్త(జీ గ్రేడ్) డాక్టర్ శివాజీ చదరం అభిప్రాయపడ్డారు. బుధవారం యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో సైన్స్ వితౌట్ బోర్డర్స్ అంశంపై జరిగిన నేషనల్ వెబనార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సమకాలీన ఆధునిక శాస్త్ర సాంకేతిక అంశాలపై విద్యార్థులకు వివరించారు. సైన్స్‌అండ్‌టెక్నాలజీలో ఉపాధి అవకాశాలు అంది పుచ్చుకోవాలని ఆయన విద్యార్థులకుసూచించారు. అనంతరం శాస్త్రవేత్త చదరం శివాజీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్‌రేఖా రామారావు, భౌతిక శాస్త్ర విభాగం అధ్యాపకులు పీఎస్ జగ్గారావు, కె.వెంకన్న, కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకుడు మార్టిన్ పాల్గొన్నారు.

అశ్లీల నృత్యాల నిర్వాహకులపై కేసు



అశ్లీల నృత్య ప్రదర్శన నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్: మండలంలోని ములకలాపల్లిలో ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా సోమవారం రాత్రి మహిళలతో అశ్లీల నృత్య ప్రదర్శన చేయించిన నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు.అశ్లీల నృత్య ప్రదర్శనకు ఉపయోగించిన సౌండ్ సిస్టమ్ పరికరాలను పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. బుధవారం ములకలాపల్లి గ్రామ పెద్దల సమక్షంలో నిర్వాహకులను సీఐ ధనుంజయరావు మందలించి, ఇకపై అలాంటివి పునరావృతం చేయవద్దని కౌన్సెలింగ్ చేశారు.

వీధి కుక్కల బారి నుంచి రక్షించాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణ ప్రజలను వీధి కుక్కల బెడద నుంచి రక్షించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కోరారు. కుక్కల నుంచి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో షేక్ అయిషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి కుక్కలు విచ్చల విడిగా తిరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు వీటి బారిన పడి తీవ్ర గాయాల పాలవుతున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడాల్సి వస్తోందని చెప్పారు. పట్టణంలో విచ్చల విడిగా తిరుగుతున్న కుక్కలను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్త, ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, కార్యవర్గ సభ్యులు కొత్తూర్తి రామారావు, దువ్వార నేతాజీ తదితరులు పాల్గొన్నారు.


నాట్లు వేసిన 15 రోజుల తరువాత ఎరువులు వేయాలి




మామిడిపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి

అనకాపల్లి: వరినాట్లు వేసిన 15 రోజుల తరువాత పొలంలో తప్పనిసరిగా కాంప్లెక్స్ ఎరువులు 25 కిలోలు, యూరియా 25 కిలోలు కలిపి వేస్తే, దుబ్బులు ఎక్కువ పిలకలను పెట్టి అధిక దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయని మండల వ్యవసాయశాఖ అధికారి పి.బి.రంగాచారి తెలిపారు. మండలంలోని మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పొలంలో రైతులు సాధారణ యూరియా స్థానంలో నానో యూరియాను ఎకరానికి 500 మిల్లీ లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతానికి ఎటువంటి చీడపీడలు లేనందువల్ల ఏరకమైన పురుగుమందులు వాడవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జోత్స్న, హిమవాణి, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది సత్యారావు, సత్యవేణి, రైతులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో ప్రయాణికుల అవస్థలు



భారీ గోతులతో దలాయిపాలెం రోడ్డు



రామచంద్రమ్మ ఆలయం వద్ద ఏర్పడిన గుంతలు

పరవాడ: వాడచీపురుపల్లి-కలపాక రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రహదారిలో రాకపోకలు సాగిస్తున్న ఉప్పు లారీలు, వివిధ పరిశ్రమలకు చెందిన భారీ వాహనాలతో రోడ్డులో ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా రామచంద్రమ్మ ఆలయం, ఉప్పుగల్లీల వద్ద రోడ్డు గుంతలమయం కావడంతో ఎన్టీపీసీ, హిందూజా, ఉప్పుగల్లీల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. దారుణంగా ఉన్న రోడ్డులో స్కూల్ బస్సులు, ఆటోలు తరచూ మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు చేరలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్లపొదలతో బస్సులు, వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు తిప్పలు పడాల్సి వస్తోంది. రామచంద్రమ్మ ఆలయం వద్ద బోరు నుంచి మంచినీటిని నిత్యం ట్యాంకర్ల ద్వారా తరలించే క్రమంలో వృథా నీరంతా రోడ్డు మీద నిలిచి, రహదారి గుంతలమయంగా మారుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.